



Truth of News

# సూర్య వాస్తవం

PRGI Reg No: APTEL/26/A4781

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 42 | ఆదివారం 20 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు శ్రీరామరక్ష

- ఫిరాయింపులను ప్రోత్సహించిన బీఆర్ఎస్ కు చెంపపెట్టు
- ఎప్పుడు ఉప ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ సిద్ధం
- కేసీఆర్ ఫాంహౌజ్ పై ప్రజలకు నిజాలు తెలియాలి
- బీజేపీది పార్టీలను చీల్చేతత్వం
- మోదీ, అమిత్‌షా ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారు : పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



**న్యూఢిల్లీ -సూర్య వాస్తవం:**

పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీకి శ్రీరామరక్ష అని పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో ఈ ఫిరాయింపుల కల్చర్ ను తెచ్చిన కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీలకు ఇది చెంపపెట్టు అని విమర్శించారు. మూడు రోజులుగా ఢిల్లీలో ఉన్న మహేశ్ కుమార్ గౌడ్... శనివారం తెలంగాణ భవన్ లోని శబరీ బ్లాక్ లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. 2014, 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వమే పార్టీ

- మిగతా 2లో..



## యూపీఐ ఛార్జీల పెంపుపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి

### - ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ -సూర్య వాస్తవం:**

డిజిటల్ లావాదేవీలు, యూపీఐ సేవలపై కొత్తగా తెరపైకి వచ్చిన ఛార్జీలు, మర్చంట్ డిస్కౌంట్ రేట్ అంశంపై దేశంలో తీవ్ర చర్చ జరుగుతున్న వేళ, ఈ పరిణామాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. దేశ ఆర్థిక వ్యవస్థపై, సామాన్యుల మీద దీని ప్రభావం ఎలా ఉంటుందనే అంశంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.దేశంలో డిజిటల్ చెల్లింపులను మరింత విస్తృతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రధాని మోదీ

- మిగతా 2లో..

# 'పేదలకు పట్టాభిషేకం'..

- లబ్ధిదారులకు ఆస్తి హక్కు పత్రాలు అందించిన సీఎం చంద్రబాబు
- 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు పంపిణీ
- పేదల ఇళ్ల కోసం 399 ఎకరాల భూమి క్రమబద్ధీకరణ
- పట్టాలు అందించి ర్యాంప్ వాక్‌తో అలరించిన సీఎం చంద్రబాబు
- పంపిణీ చేసిన ఆస్తుల విలువ రూ.8,874 కోట్లు



**అమరావతి - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది నిరుపేద కుటుంబాలకు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న ఇంటి స్థలాల పట్టాలను (ఆస్తి హక్కు పత్రాలు) ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని 28,445 కుటుంబాలకు వారి సొంతింటి కల సాకారమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఇళ్ల స్థలాల కోసం 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించింది. ఈ క్రమబద్ధీకరించిన స్థలాలకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందించారు. పంపిణీ చేసిన ఈ ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.8,874 కోట్లు ఉంటుందని అంచనా. ఈ కార్యక్రమం నగరంలో పండగ వాతావరణాన్ని తలపించింది. అంతకుముందు, ఇవాళ విశాఖపట్నం చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. పట్టాల పంపిణీ కార్యక్రమం అనంతరం చంద్రబాబు లబ్ధిదారులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. వేదికపై ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నడుస్తూ ఆయన లబ్ధిదారులను, సభకు హాజరైన వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాటు పలువురు కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు. దశాబ్దాలుగా ఉన్న తమ సమస్యకు పరిష్కారం లభించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.



## మద్యపాన నిషేధం సాధ్యమా?

- అక్రమ వ్యాపారానికి దారితీస్తుందా?
- వ్యసనపరులు తృష్ణను వదులుకోలేరు
- మహారాష్ట్ర కేసు విచారణలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ -సూర్య వాస్తవం**

సంపూర్ణ మద్యపాన నిషేధం సాధ్యమా? లేకపోతే ఈ నిర్ణయం అక్రమ వ్యాపారానికి దారి తీస్తుందా? అని సుప్రీంకోర్టు ప్రశ్నలను లేవనెత్తింది. మహారాష్ట్రకు సంబంధించిన ఒక కేసు విచారణ సందర్భంగా శనివారం సుప్రీంకోర్టు ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ పలు ప్రశ్నలను సంధించింది. గుజరాత్‌లో సంపూర్ణ మద్యపాన నిషేధం ఉన్నా మద్యం విషప్రయోగ విషాదాలు జరిగిన ఉదంతాలు అనేకం ఉన్నాయని పేర్కొంది. 600 మంది వరకు ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. ప్రభుత్వ

- మిగతా 2లో..



2లో

## రేఖాగుప్తా, కేజ్రీవాల్‌కు 'సర్' నోటీసులు

- ఎన్యూమరేషన్ ఫారమ్‌ల్లో సరిగా లేని వివరాలు
- ఢిల్లీలో 33.13 లక్షల మంది ఓటర్లకు కూడా..



## రాష్ట్రపతి ఏడీసీగా మేజర్‌నవ్య షెకావత్ నియామకం

- తొలి మహిళా ఆర్మీ అధికారిగా రికార్డు

2లో

## అక్టోబర్ 1న కరవు మండలాలను అధికారికంగా ప్రకటించండి

- రాష్ట్రవ్యాప్తంగా 513 మండలాల్లో కరవు ఛాయలు ఉన్నట్టు ప్రాథమిక అంచనా
- పంట నష్టాన్ని నివారించి, సూక్ష్మ సేద్యం, ప్రకృతి సాగును ప్రోత్సహించాలని సూచన
- తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, విశాఖపై ప్రత్యేక కార్యాచరణకు ఆదేశం
- ఎల్‌నినో ప్రభావంతో ఉద్యాన పంటల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశం
- రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష



**అమరావతి - సూర్య వాస్తవం**

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేసి, అక్టోబర్ 1న కరవు మండలాలను అధికారికంగా ప్రకటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎక్కడా పంట నష్టం జరగకుండా, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ఠమైన ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కరవు పరిస్థితులపై ప్రతీ నెలా కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని నిర్దేశించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ-ఉద్యాన పంటల పరిస్థితి, రైతుల ఇబ్బందులు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై శనివారం తన క్యాంపు కార్యాలయంలో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.కరవు మండలాల గుర్తింపు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, శాస్త్రీయంగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. వర్షపాతం, పంటల సాగు, భూగర్భ జలాలు, నేలలో తేమ శాతం, ఉపగ్రహ చిత్రాలు, జలాశయాల్లో నీటి నిల్వలు వంటి ఆరు కీలక అంశాలను సమగ్రంగా విశ్లేషించి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

**513 మండలాల్లో కరవు ఛాయలు**

2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ప్రాథమిక అంచనాల ప్రకారం మొత్తం 513 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటిలో 268 మండలాల్లో తీవ్రమైన వర్షాభావం, 245 మండలాల్లో

- మిగతా 2లో..

## విద్యార్థులకు మరింత ఆకర్షణీయమైన రంగుల్లో యూనిఫాం

### - వచ్చే ఏడాదికి ఇప్పటి నుంచే ప్రణాళిక
### - ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ -సూర్య వాస్తవం:**

విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని సీఎం అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ పిల్లలకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని, రెండో జత యూనిఫాంను నెలాఖరులోగా అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డికి అధికారులు తెలియజేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు పంపిణీ పూర్తయిందన్నారు. ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు,


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### యూపీఐ ఛార్జీల పెంపుపై
## దేశవ్యాప్తంగా చర్చ జరగాలి

(మొదటిపేజీ తరువాయి)
స్పష్టం చేశారు. అయితే, మారుతున్న ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయ వాణిజ్య విధానాల నేపథ్యంలో డిజిటల్ మౌలిక వసతులను బలోపేతం చేసే క్రమంలో అన్ని పక్షాలు పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సామాన్యులకు, చిన్న వ్యాపారులకు ఎలాంటి అదనపు భారం పడకుండా చూసేందుకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.మరోవైపు, యూపీఐ లావాదేవీలపై పడుతున్న అదనపు ఛార్జీలు మరియు జీఎస్టీ వడ్డనల వల్ల మధ్యతరగతి, సామాన్య ప్రజలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని విపక్షాలు, వర్తక సంఘాల నుంచి డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

### మద్యపాన నిషేధం
## సాధ్యమా?

(మొదటిపేజీ తరువాయి)
ఆదాయానికి గండిపడుతుం దని, శాంతిభద్రతల నిర్వహణ ఖర్చులు పెరుగుతాయని, పోలీసు, ఎక్సైజ్ శాఖలో అవినీతి పెచ్చుమీరే అవకాశం ఉందని, అక్రమ మద్యం తయారీ పెరుగుదల, దీంతో ముడిపడి ఉన్న మాదకద్రవ్యాల ముప్పు కూడా పొంచి ఉందని పేర్కొంది. గతంలో పలు రాష్ట్రాల్లో చేపట్టిన మద్య నిషేధం ప్రభావాలు, నష్టాలు వంటి నిదర్శనాలను ప్రస్తావించింది. రంగు, రుచి మారడం వల్ల వ్యసనపరులు తమ తృష్ణను వదులు కోలేరని పేర్కొంది. ఎక్సైజ్ చట్టాలను బలోపేతం చేసి మద్యం, రవాణా, నిల్వ, తయారీపై కఠిన చర్యలు, నియంత్రణలు అమలు చేయడం ఉత్తమమన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు రాజ్యాంగబద్ధం, సహేతుకంగా లేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు శ్రీరామరక్ష

(మొదటిపేజీ తరువాయి)
ఫిరాయింపులను ప్రోత్సహించిందని గుర్తు చేశారు. టీడీపీలో గెలిచిన తలసాని, కాంగ్రెస్ నుంచి గెలిచిన సబిత, ఇతర పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలకు నేరుగా మంత్రి పదవులు ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్ ది అని మండిపడ్డారు. అలాగే కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లోకి తీసుకుని ప్రతిపక్షానికి శాసనసభలో సరైన హోదా లేకుండా చేశారన్నారు. ఇప్పుడు పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ ఫిరాయింపుల విషయంలోనూ అప్పటి ప్రభుత్వం అనుసరించిన విధానాలను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదన్నారు.

**ప్రభుత్వాన్ని కూల్చుతామన్నారు...**

పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే ముందు తమ ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలను గుర్తు చేసుకోవాలని బీఆర్ఎస్ నేతలకు పీసీసీ చీఫ్ హితవు పలికారు. ప్రధానంగా ఆనాటి సీఎం కేసీఆర్ అనేక నిబంధనలు ఉల్లంఘించి, ఫిరాయింపులను ప్రోత్సహించారని మండిపడ్డారు.

**బీజేపిది పార్టీలను చీల్చే సంస్కృతి...**

దేశవ్యాప్తంగా పార్టీ ఫిరాయింపులను బీజేపీ కూడా ప్రోత్సహించిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఫిరాయింపులతో ఆగకుండా... పార్టీలను చీల్చి లబ్ధి పొందే సంస్కృతికి తెరలేపిందని తీవ్రంగా మండిపడ్డారు. టీ-ఎంసీ, శివసేన, ఎన్‌సీపీ వంటి పార్టీలను చీల్చి పలు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీశారని ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులపై దేశవ్యాప్తంగా ఒకే విధమైన రాజకీయ ప్రమాణాలు ఉండాలని అన్నారు. కాగా... ఎవరికి మంత్రి పదవులు ఇవ్వాలి, ఎప్పుడు ఇవ్వాలనే నిర్ణయం పూర్తిగా సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. పార్టీ, ప్రభుత్వానికి సంబంధించిన అంశాల్లో అధిష్టానం, ముఖ్యమంత్రి నిర్ణయాలకు అనుగుణంగానే ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

### విద్యార్థులకు మరింత ఆకర్షణీయమైన
## రంగుల్లో యూనిఫాం

(మొదటిపేజీ తరువాయి)
స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్ షీట్లు, టవళ్లు పంపిణీ పూర్తయిందని సీఎంకు అధికారులు వివరించారు. వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, ఇతర సామగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లు ప్రణాళిక రూపొందించు కోవాలన్నారు. ఈ ఏడాది అందించిన యూనిఫాం, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమైందని సీఎం అన్నారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు సబ్యసాచి ఘోష్, బాల మాయాదేవి, అహ్మద్ నదీమ్, దివ్య దేవరాజన్, నవీన్ నికోలస్, శ్రుతి ఓజా, సైదులు, సంతోష్ ,సీతా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రేఖాగుప్తా, కేజ్రీవాల్‌కు 'సర్' నోటీసులు

**- ఎన్యూమరేషన్ ఫారమ్‌ల్లో సరిగా లేని వివరాలు**
**- ఢిల్లీలో 33.13 లక్షల మంది ఓటర్లకు కూడా..**

న్యూఢిల్లీ -సూర్య వాస్తవం

కొనసాగుతున్న సర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియలో భాగంగా సమర్పించిన వివరాలలో లోపాలు ఉన్నందున, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌తో సహా పలువురు ప్రముఖ ఓటర్లకు ఎన్నికల సంఘం శనివారం నోటీసులు జారీ చేసింది. సీఎం సంబంధించిన వివరాలు 'ధృవీకరించాం' అని, నవంబర్ 4న విడుదల కానున్న షాలిమార్ బాగ్ నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాలో ఆమె పేరు చేర్చుతామని సీఈఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్యూమరేషన్ ఫారమ్‌లో అందించిన వివరాల ఆధారంగా, తార్కిక అసమానతలు ఉన్న జాబితాలో రేఖాగుప్తాకు సంబంధించిన వివరాలు గుర్తించామ ని పేర్కొంది. ఢిల్లీలో ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న 33.13 లక్షల మంది ఓటర్లకు, వారి ఎన్యూమరేషన్ ఫారమ్ వివరాలలో ఉన్న లోపాల వల్ల నోటీసులు పంపుతామని తెలిపింది. ఇప్పటివరకు 31.63 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందాయని వెల్లడించింది. వయస్సులో తేడా ఉండడంతో సీఎం రేఖా గుప్తాకు నోటీసు ఇచ్చారు. ఢిల్లీ బీజేపీ మాజీ అధ్యక్షుడు వీరేంద్రసచ్దేవా, ఎంపీ కపిల్ సిబల్, బీజేపీ నేత సుధాంశు మిట్టల్లకు నోటీసులు పంపారు. కేజ్రీవాల్‌కు, గత సర్ వివ రాలతో అనుసంధానం కాకపోవడం వల్ల నోటీసు వచ్చింది. ఆయన భార్య సునీతా కేజ్రీవాల్, తల్లిదండ్రులు, కుమారుడికి కూడా నోటీసులు జారీచేశారు.

### అక్టోబర్ 1న కరవు మండలాలను
## అధికారికంగా ప్రకటించండి

(మొదటిపేజీ తరువాయి)
మోస్తరు వర్షాభావం నెలకొందని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనను వ్యవసాయ శాఖ చేపడుతుందని, జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు పంట, దిగుబడి నష్టాన్ని అంచనా వేస్తాయని చెప్పారు. ఈ నివేదికలను కలెక్టర్లు సెప్టెంబర్ 24లోగా రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. సెప్టెంబర్ 29న జరిగే రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనలను పరిశీలించి, తుది జాబితాను సిద్ధం చేస్తామని అధికారులు వెల్లడించారు.

**ఉద్యాన పంటల రక్షణ, సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత**

వర్షాభావ పరిస్థితులతో పాటు ఎల్‌నినో ప్రభావం వల్ల ఉద్యాన పంటలు ప్రమాదంలో ఉన్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 1,357 రైతు భరోసా కేంద్రాల పరిధిలోని పంటలు 'హై రిస్క్' కేటగిరీలో ఉన్నాయని, సుమారు 17,916 హెక్టార్లలో నారింజ, బత్తాయి, మామిడి, మిరప, ఉల్లి వంటి పంటలు ప్రభావితం కానున్నాయని తెలిపారు.

దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, ఉద్యాన పంటలను కాపాడేందుకు ఇప్పటికే రూ.190 కోట్లు కేటాయించామని, వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. నీటి లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణాన్ని కాపాడేందుకు సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్) వైపు రైతులను ప్రోత్సహించాలని నిర్దేశించారు. ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఆపీఎంఐపీ) సేవలను 'మన మిత్ర' వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రైతులకు అందుబాటులోకి తేవడాన్ని ప్రశంసించారు. సూక్ష్మ సేద్యంతో పాటు ప్రకృతి సేద్యం వైపు రైతులను మళ్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి.. విశాఖకు కార్యాచరణ**

రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాంతంలోనూ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారుల దేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బోర్లపై ఆధారపడిన ప్రాంతాల్లో అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా విశాఖపట్నం నగరంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే పక్కా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.

ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో తక్షణమే అత్యవసర సమావేశం నిర్వహించి తాగునీటి సరఫరా పనులను వేగవంతం చేయాలన్నారు. విశాఖ సమీపంలోని రిజర్వాయర్లను యుద్ధప్రాతిపదికన నింపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని, మేఘాద్రిగడ్డకు పోలవరం ఎల్ఎంసీ ప్యాకేజీ-8 కింద పైపులైన్ ద్వారా నీటిని తరలించే పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రస్తుతం విశాఖ నగరానికి మరో రెండు నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు.

### రాష్ట్రపతి ఏడీసీగా
## మేజర్ నవ్య షెకావత్ నియామకం
### - తొలి మహిళా ఆర్మీ అధికారిగా రికార్డు

**న్యూఢిల్లీ -సూర్య వాస్తవం:** రాజస్తాన్ కు ప్రాంతానికి చెందిన మేజర్ నవ్య షెకావత్ రాష్ట్రపతి ఏడీసీగా నియామకమయ్యారు. దీంతో ఈ ఘనత సాధించిన మొదటి ఆర్మీ మహిళా అధికారిగా ఆమె రికార్డు సృష్టించారు. దేశంలో రాష్ట్రపతికి ఏడీసీగా నియమితులైన రెండో మహిళా అధికారిగా నిలిచారు. 2025లో ఇండియన్ నేవీకి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ యశస్వి సోలంకి ఈ పదవిని చేపట్టిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు. ఇప్పుడు ఆర్మీ నుంచి నవ్య షెకావత్ ఆ గౌరవాన్ని దక్కించుకున్నారు. జులై 2026లో ఈ నియామకం జరగ్గా, ప్రస్తుతం ఆమె రాష్ట్రపతి భవన్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

**ఆమె కుటుంబం మూడు తరాలు సైన్యంలోనే**

మేజర్ నవ్య షెకావత్‌ది పూర్తిగా సైనిక కుటుంబం. సికార్ జిల్లాలోని చిన్న గ్రామమైన కేర్పురాకు చెందిన నవ్య కుటుంబం మూడు తరాల వారు సైన్యంలో పనిచేశారు. ఆమె తాత భన్వర్ సింగ్ షెకావత్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో వింగ్ కమాండర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఆమె తండ్రి గ్రూప్ కెప్టెన్ కరణ్ సింగ్ షెకావత్ ప్రస్తుతం ఎయిర్‌ఫోర్స్‌లోనే ఉన్నత హోదాలో సేవలు అందిస్తున్నారు. మూడో తరమైన నవ్య ప్రస్తుతం ఆర్మీలో మేజర్‌గా పనిచేస్తున్నారు.

**సీడీఎస్ పరీక్ష ద్వారా సైన్యంలోకి ప్రవేశం**

నవ్య తన స్కూలు, కాలేజీ చదువులు పూర్తి చేసిన తర్వాత సైన్యంలో సేవలందించాలని అనుకున్నారు. అందుకోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహించే కఠినమైన యూపీఎస్సీ 'సీడీఎస్' పరీక్షను రాశారు. తొలి ప్రయత్నంలోనే ఆ పరీక్షలో మంచి మార్కులు సాధించారు. ఆ తర్వాత చెన్నైలోని ప్రతిష్టాత్మక 'ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ'లో శిక్షణ తీసుకున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత 2021వ సంవత్సరంలో ఆమెకు భారతీయ సైన్యంలోని 'ఆర్మీ సర్వీస్ కార్ప్స్' విభాగంలో అధికారిగా అవకాశం లభించింది. ఈ విభాగం సైన్యానికి కావాల్సిన ఆహారం, వస్తువులు, రవాణా, ఇతర ముఖ్యమైన సహాయాలను అందిస్తుంది. ఈ శాఖలో అంకితభావంతో పనిచేస్తూ కేవలం ఐదేండ్ల లోనే మేజర్ స్థాయికి ఎదిగారు. ఇప్పుడు నేరుగా రాష్ట్రపతి భవన్ వరకు వెళ్లి దేశం దృష్టిని ఆకర్షించారు.

# కరువు ప్రాంతాల్లో జగన్ టూర్

విజయవాడ-సూర్య వాస్తవం



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరో అంశాన్ని ప్రధానంగా తీసుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటివరకు మెగా డీఎస్సీ అంశంపై ఎక్కువగా దృష్టి పెట్టిన పార్టీ.. ప్రస్తుతం రైతుల సమస్యలు, వర్షాభావ పరిస్థితులను కూడా ఉద్యమ కార్యాచరణలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ ప్రధాన కార్యదర్శులు, రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో రాష్ట్రంలోని వర్షపాతం, సాగు పరిస్థితులు, నీటి కొరత, రైతుల ఇబ్బందులపై జిల్లా వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నట్లు వైఎస్సార్సీపీ తెలిపింది. పార్టీ విడుదల చేసిన వివరాల ప్రకారం.. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని జగన్ పేర్కొన్నారు. మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, వాటిలో 332 మండలాల్లో పరిస్థితి తీవ్రంగా ఉందని ఆయన తెలిపారు.సాగు విస్తీర్ణం తగ్గడంపైనా సమావేశంలో చర్చ జరిగింది. సాధారణంగా ఖరీఫ్‌లో 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా, ఈసారి 56.4 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు వేసినట్లు జగన్ పేర్కొన్నారు. దాదాపు 20 లక్షల ఎకరాలు సాగుకు దూరంగా ఉన్నాయని చెప్పారు. పంటలు వేసిన రైతులు కూడా వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు నష్టపోయారని ఆయన వెల్లడించారు. ఈ గణాంకాలు వైఎస్సార్సీపీ వర్గాలు వెల్లడించినవే.వర్షాభావానికి సంబంధించి ప్రభుత్వం తగిన సమయంలో చర్యలు తీసుకోలేదని జగన్ ఆరోపించారు. ఫిబ్రవరిలోనే ఎల్‌నినో ప్రభావంపై హెచ్చరికలు వచ్చినప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలోనే "ఎల్లో నినో" అంటూ కూటమి ప్రభుత్వంపై రాజకీయ విమర్శ చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి నుంచే ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనే ప్రణాళికలు ప్రారంభించిందని మరో నివేదిక పేర్కొంటోంది. రైతులకు పంట నష్టం, సాగు చేయలేని భూములకు పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటి అంశాలపై జగన్ పలు డిమాండ్లు చేశారు. కరువు ప్రభావిత మండలాలను ప్రకటించడం, రైతు రుణాల పునర్వ్యవస్థీకరణ, పంటల బీమాను పునరుద్ధరించడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే వైఎస్సార్సీపీ నేతలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకుని జిల్లా వారీగా డిమాండ్లను ప్రభుత్వానికి అందించాలని సూచించారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తరించే అంశంపైనా సమావేశంలో దిశానిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో రైతులతో కలిసి కార్యక్రమాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని జగన్ సూచించారు. రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారుతాను కూడా పరిస్థితిని బట్టి కరువు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తానని తెలిపారు. దీంతో రాబోయే రోజుల్లో రైతుల సమస్యలు వైఎస్సార్సీపీ రాజకీయ కార్యక్రమాల్లో ప్రధాన అంశంగా మారే అవకాశం ఉంది.

### సౌదీలో ఎమర్జెన్సీ.. మోగిన సైరన్లు
## సౌదీ రియాద్ ఎయిర్‌పోర్టుపై దాడి

రియాద్-సూర్య వాస్తవం

యెమెన్‌లోని ఇరాన్ మద్దతు గల హౌతీ మిలిటెంట్లు, సౌదీ రాజధాని రియాద్‌తో పాటు ఆ దేశపు ఎర్ర సముద్ర తీరంలోని ఇంధన కేంద్రాలపై డ్రోన్, బాలిస్టిక్ క్షిపణి దాడులు జరిపినట్లు ప్రకటించారు. రియాద్‌పై ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణి దాడులను సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయని అధికారులు తెలిపారు. సౌదీఅరేబియాకు సైనిక మద్దతు ఇవ్వనున్నట్లు తుర్కియే ప్రకటించింది. అంతకుముందు, సౌదీ రాజధానిలోని అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఇంధన ట్యాంకులే టార్గెట్ దాడులు జరిగాయి. భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో దట్టంగా పొగ అలుముకుంది. ఎయిర్‌పోర్టు సిబ్బంది తక్షణమే రంగంలోకి దిగి మంటలను అదుపుచేశారు. ఈ దాడితో విమాన సర్వీసులకు తాత్కాలికంగా అంతరాయం కలిగింది. ఇప్పటికే సౌదీవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. హౌతీ తిరుగుబాటుదారులతో మళ్లీ ఘర్షణలు మొదలయ్యాయి.



జూలైలో ఇరాన్ మద్దతు గల హౌతీలు సౌదీ అరేబియా పై తమ దాడులను పెంచినప్పటి నుండి, రాజధానిలో మొదటిసారిగా వైమానిక దాడి హెచ్చరికలు మోగాయి. మధ్యప్రాచ్యంలో ఉన్న అమెరికన్లను "అప్రమత్తంగా ఉండాలని, అలాగే విమానాలు రద్దయ్యే లేదా ఇతర ప్రయాణ అంతరాయాలు ఏర్పడే అవకా శాలకు సిద్ధంగా ఉండాలని" అమెరికా విదేశాంగ శాఖ కోరింది.

# సంపాదకీయం

## బ్రిటన్.. కర్మ రిటర్న్స్....

రవి అస్తమించని సామ్రాజ్యంగా 19వ శతాబ్దంలో ప్రపంచాన్ని శాసించిన యునైటెడ్ కింగ్‌డమ్ ఇప్పుడు నాలుగు ముక్కలు అయ్యే ముప్పును ఎదుర్కొంటోంది. స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ స్వాతంత్ర్యాన్ని సాధించుకోవడానికి సిద్ధపడుతుండటమే దీనికి కారణం. యునైటెడ్ కింగ్‌డమ్.. యరోప్‌లోని ఓ ప్రధాన దేశంగా, ఒకప్పుడు భారత దేశాన్ని పాలించిన దేశమని చరిత్ర చెబుతుంది. బ్రిటన్, ఇంగ్లాండ్ పేర్లు కూడా వ్యవహారంలో ఉన్నాయి. ఈ దేశానికి వేల సంవత్సరాల చరిత్ర ఉంది. అనేక ఆక్రమణలు, సామ్రాజ్యాల విస్తరణ, పారిశ్రామిక విప్లవం, ప్రజాస్వామ్య పరిణామాల సమాహారం ఇది. బ్రిటన్‌లో రాచరిక వ్యవస్థ కొనసాగుతున్నా.. ప్రపంచానికి ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను పరిచయం చేసిన ఘనత బ్రిటన్‌కు ఉంది. బ్రిటన్ పార్లమెంట్‌ను "మదర్ ఆఫ్ పార్లమెంట్స్" అని పిలుస్తారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి ప్రధానమంత్రిని ఎన్నుకొని పరిపాలన కొనసాగిస్తున్నారు. చరిత్రలోకి వెళ్లి చూస్తే 80 ఏళ్ల క్రితం భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 60కిపైగా దేశాలను ఆక్రమించుకుని.. రవి అస్తమించని సామ్రాజ్యాన్ని పాలించిన ఘనత బ్రిటన్‌కు ఉంది.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అన్ని దేశాలకూ స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది. ఇప్పుడు ఓ చిన్న దేశంగా మిగిలిపోయిన యునైటెడ్ కింగ్‌డమ్‌కు కొత్త ముప్పు పొంచి ఉంది. ఒకప్పుడు రవి అస్తమించని సామ్రాన్ని నిర్మించిన బ్రిటన్ ప్రభ ఇప్పటికే సమక బారింది. 80 ఏళ్ల క్రితం భారత దేశాన్ని విభజించిన యునైటెడ్ కింగ్‌డమ్ ఇప్పుడు నాలుగు దేశాలుగా ముక్కలయ్యే పరిస్థితి ఏర్పడింది. యునైటెడ్ కింగ్‌డమ్ అంటే బ్రిటన్, స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ భాగాలు కలిసి ఉన్న సంయుక్త దేశం. కానీ ఇప్పుడు ఆ దేశాల ఐక్యతపైనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తాజా స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్లు కార్డిఫ్ వేదికగా సమావేశమై ఇంగ్లాండ్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశాలుగా ఏర్పడటానికి అవసరమైన రెఫరెండం, భవిష్యత్ వ్యూహాలపై చర్చించారు. తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే హక్కు ప్రజలకు ఉందని స్పష్టం చేస్తూ ఓ చారిత్రక ఒప్పందంపై సంతకాలు చేశారు. అనంతరం యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి తాము విడిపోవడానికి రాజ్యాంగ ప్రక్రియను ప్రారంభించాలని ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్‌ను డిమాండు చేశారు. యునైటెడ్ కింగ్‌గ్టమ్ నుంచి విడిపోయి పూర్తి స్వయం ప్రతిపత్తిగల దేశాలుగా ఉండాలని స్కాట్‌లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ దేశాలు బలంగా కోరుకుంటున్నాయి. స్వాతంత్ర్యాన్ని కోరుకునే ఫస్ట్ మినిస్టర్లు ఒకేసారి అధికారంలో ఉండటం ఇదే తొలిసారి అదే జరిగితే ఆ రాజ్యంలో ఇంగ్లాండ్ ఒకటే మిగులుతుంది. కార్డిఫ్‌లో జరిగిన సమావేశంలో స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్, ఎసఎన్‌పీ నేత జాన్ స్విన్నీ, వేల్స్ ఫస్ట్ మినిస్టర్, ప్లాయిడ్ కవ్రి పార్టీ చీఫ్ రూన్ ఆప్ ఇయర్వర్త్, నార్తర్న్ ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్, సిన్ ఫెయిన్ పార్టీ నేత మిషెల్ పాల్గొన్నారు. వీరు సంతకం చేసిన ఈ అగ్రిమెంటులోని అత్యంత కీలకమైన అంశం స్వయం నిర్ణయాధికారం. వెస్ట్ మినిస్టర్‌గా పిలిచే బ్రిటన్ పార్లమెంట్, ప్రభుత్వానికి కాలం చెల్లిపోయిందనడానికి ఇంతకు మించిన సంకేతం లేదని ఒప్పందంలో పేర్కొన్నారు.. రాజ్యాంగ మార్పునకు సిద్ధంగా ఉండాలని, తమ భవిష్యత్ యరోప్ యనియన్‌తో ముడిపడి ఉందని వీరు ఆండీ బర్న్‌హామ్ ప్రభుత్వానికి తెలియజేశారు. తమ సంస్కృతులను కాపాడుకునేలా సొంత నిర్ణయాలు తామే తీసుకోవాలని స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ ప్రజలు భావిస్తున్నారని నేతలు చెబుతున్నారు. ముఖ్యంగా స్కాట్లాండ్‌లో స్వతంత్ర దేశంగా మారాలనే ఉద్యమం అత్యంత బలంగా ఉంది. ముఖ్యంగా స్కాటిష్ నేషనల్ పార్టీ ఈ డిమాండ్ చేస్తోంది. వాస్తవానికి 2014లో స్వాతంత్ర్యంపై ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. అప్పుడు 55% మంది ఇఖలోనే కొనసాగాలని, 45% మంది స్వాతంత్ర్యానికి అనుకూలంగా ఓటేశారు. దీంతో స్కాట్లాండ్ స్వాతంత్ర్య ప్రయత్నం అప్పట్లో విఫలమైంది. అయితే బ్రెగ్జిట్ తర్వాత పరిస్థితులు మారాయని ఎసఎన్‌పీ వాదిస్తోంది. స్కాట్లాండ్ ప్రజలు ఈయలోనే ఉండాలని అనుకుంటున్నారని, ఈయ నుంచి బ్రిటన్ బయటకు రావడం వారికి నచ్చలేదని, అలాగే తమ ప్రాంతంలోని చమురు సంపదపై నిర్ణయాధికారం తమకే ఉండాలనుకుంటున్నారని చెబుతున్నారు. స్కాటిష్ నేషనల్ పార్టీ మరోసారి స్వాతంత్ర్యంపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది. ఇక ఉత్తర ఐర్లాండ్ విషయానికొస్తే.. అక్కడి ప్రజల్లో చాలామంది పక్కనే ఉన్న రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్ దేశంతో కలిసిపోవాలని కోరుకుంటున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ పాలన నుంచి వేరుపడి, గతంలో తమకున్న గుర్తింపును తిరిగి పొందాలని కోరుకుంటున్నారు. బ్రెగ్జిట్ కారణంగా వాణిజ్యపరంగా నష్టపోతున్నామని అనుకుంటున్నారు. ఇక తమ చట్టాలను తామే చేసుకోవాలని, తమకంటూ ప్రత్యేకమైన భాష, సంస్కృతిని కాపాడుకోవాలని వేల్స్ ప్రజలు ఆశిస్తున్నారని అంటున్నారు. అయితే ఈ మడు ప్రాంతాల ఫస్ట్ మినిస్టర్ల డిమాండ్లను ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ పెద్దగా పట్టించుకున్నట్లుగా కనిపించలేదు. ఈ హెచ్చరికను ప్రధాని పక్కనబెట్టారని, రాజ్యాంగ చర్చల కంటే జీవన వ్యయాన్ని తగ్గించడానికి సంబంధించిన చర్యలకే ఆయన ప్రాధాన్యమిస్తున్నారని ఆండీ బర్న్‌హామ్ కార్యాలయం స్పష్టం చేసింది. విభజనకు బదులుగా ఉమ్మడి విలువలకు కట్టుబడి, సమస్య పరిష్కారానికి ప్రజలు కలిసి వచ్చినప్పుడే యకే అత్యుత్తమంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్యం, విభజన వంటి రాజ్యాంగ అంశాల కంటే ప్రజల రోజువారీ ఆర్థిక సమస్యలకే ఆండీ బర్న్‌హామ్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుతం 3దేశాల మధ్య కుదిరిన ఒప్పందానికి తక్షణ చట్టపరమైన బలం లేదు. దీంతో స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ వెంటనే బ్రిటన్ నుంచి విడిపోయే పరిస్థితి లేదు. అయితే రాజకీయంగా మాత్రం దీని ప్రభావం భారీగానే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మడు ప్రాంతాల లక్ష్యాలు, రాజకీయ వ్యూహాలు ఒకేలా లేకపోవడంతో తక్షణమే యునైటెడ్ కింగ్‌డమ్ విచ్ఛిన్నమవుతుందని చెప్పలేం. కానీ బ్రిటన్ రాజకీయాల్లో ఐక్యతపై ప్రశ్నలు మరోసారి ప్రధాన రాజకీయ అజెండాగా మారుతున్నాయి. ఇప్పటివరకు బ్రిటన్‌ను ఒకే దేశంగా నిలబెట్టిన రాజకీయ వ్యవస్థకు ఈ కూటమి పెద్ద సవాల్‌గా మారనుంది. మొత్తం విద భవిష్యత్తులో "యునైటెడ్ కింగ్‌డమ" కలిసి ఉంటుందా? లేక బ్రిటన్‌తో ఒక్కొక్క దేశం బ్రేకప్ చెప్తుందా అనే దానికి కాలమే సమాధానం చెప్పనుంది. కాగా ఇటీవల ఇటీవల రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్ పర్యటనకు వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. తాను అవి సంయుక్త ఐర్లాండ్‌ను చూడాలని కోరుకుంటున్నట్లు ప్రకటించారు. అది ఎప్పటికైనా జరగాల్సిందే.. ఇప్పుడే జరిగితే మంచిదంటూ ఎప్పటి నుంచో ఉన్న వివాదాస్పద అంశాన్ని ప్రస్తావించారు. ట్రంప్ వ్యాఖ్యలు చేసిన 48 గంటల్లోనే అవగాహన ఒప్పందంపై మడు దేశాలు సంతకాలు చేయడం గమనార్హం. 1922లో బ్రిటన్ నుంచి ఐర్లాండ్ స్వాతంత్ర్యం పొందింది. అయితే ఉత్తర ఐర్లాండ్ మాత్రం యకేలో ఉండిపోయింది. మరొక భాగం రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్ స్వతంత్ర దేశంగా మారింది. టిషర్లు ఒకప్పుడు ఈ భూగోళం విద ఎక్కువ భాగాన్ని తన నియంత్రణలో ఉంచుకున్నారు. కానీ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటన్ ప్రాధాన్యం తగ్గిపోవడం మొదలైంది. ప్రస్తుతం జీడీపీ పరంగా చూస్తే బ్రిటన్ ప్రపంచంలో ఐదో స్థానంలో ఉంది. నాలుగు దేశాలుగా విడిపోతే ఇంగ్లాండ్ ఐదు నుంచి ఏడో స్థానానికి పడిపోతుంది. యకేకి ఉన్న వైశాల్యంలో ఇంగ్లాండ్ 46 శాతాన్ని కోల్పోవాల్సి వస్తుంది. నార్త్ సముద్రంలోని మెజార్టీ చమురు, సహజ వాయువు నిల్వలు, పవన్ విద్యుత్ కేంద్రాలు స్కాట్లాండ్ సరిహద్దులకే పరిమితం అవుతాయి. ఐక్యరాజ్య సమితిలోని యకే వీటో అధికారం ఎవరికి దక్కాలనే చర్చ కూడా జరుగుతుంది.కాగా యునైటెడ్ కింగ్‌డమ్ విచిన్నమైతే మిలిగే అతి పెద్ద భూభాగం బ్రిటన్. విడిపోతే దాని రాజకీయ, ఆర్థిక పరిస్థితులు తీవ్రంగా ప్రభావితం అవుతాయి. ఆ పరిస్థితుల్లో ఐర్లాండ్ ఏకీకరణ వంటి ప్రశ్నలు ఇఖ భవిష్యత్తును మరింత ప్రమాదంలో పడేయనున్నాయి.




# ట్యాంకర్లతో తడులిస్తూ..

## మిర్చి పంటను కాపాడుకుంటున్న రైతులు

- అడుగంటిన భూగర్భ జలాలు..
ఎండిపోతున్న బోర్లు
- ఎన్ని బోర్లు వేసినా ఫలితం శూన్యం..
- వరుణుడి కరుణ కోసం
ఎదురుచూపులు




**బెళుగుప్ప- సూర్య వాస్తవం** :వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతులకు ప్రకృతి పరిస్థితులు కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. వర్షాలు లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు ఎండిపోతున్నాయి. దీంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన మిర్చి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. చెరువుల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి పంటలకు తడులు అందిస్తున్నారు. మండలంలోని కోనాపురం, శీర్పి గ్రామాల రైతులు మిర్చి పంటలను కాపాడు కునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రస్తుతం పంట పూత, పిందె దశలో ఉండటంతో నీటి అవసరం ఎక్కువగా ఉంది. అయితే బోర్లలో నీరు లేకపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. దీంతో రైతులు అదనపు ఖర్చులు భరిస్తూ ట్యాంకర్లతో నీటిని తెచ్చి పంటలకు అందిస్తున్నారు.

**రోజుకు ఐదారు ట్యాంకర్లు**

కోనాపురం గ్రామానికి చెందిన చిన్నకారు రైతులు చిన్న ఎర్రిస్వామి మూడు ఎకరాలు, తిమ్మరాజు రెండు ఎకరాలు, మరో ఎర్రిస్వామి మూడు ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఎకరాకు సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలిపారు. పంట పూత, పిందె దశకు చేరుకోవడంతో మంచి దిగుబడి వస్తుందని ఆశించారు. అయితే నీటి కొరత వారి ఆశలను ఆందోళనగా మార్చింది.కోనాపురం సమీపంలో సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న శీర్పి చెరువు నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్నారు. ట్యాంకర్‌కు నెలకు రూ.10 వేల వరకు అద్దె చెల్లించడంతో పాటు ట్రాక్టర్ బాడుగ, కూలీల ఖర్చులను భరిస్తున్నారు. రోజుకు ఐదు నుంచి ఆరు ట్యాంకర్ల నీటిని పొలాలకు తరలించి తడులు ఇస్తున్నామని రైతులు తెలిపారు. నీటి కోసం వెళ్లి రావడానికి సుమారు 10 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు.

**పది బోర్లు వేసినా.. చుక్క నీరు లేదు**

శీర్పి గ్రామానికి చెందిన రైతు వన్నూరుస్వామి మాట్లాడుతూ.. మూడు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశానన్నారు. ఇప్పటివరకు పది బోర్లు వేయించినా ఆశించిన ఫలితం దక్కలేదని తెలిపారు. ఒక బోరులో మాత్రమే నీరు వచ్చేదని, అది కూడా గత 20 రోజులుగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే సుమారు రూ.2.50 లక్షలు పెట్టుబడి పెట్టానని, రెండు రోజుల క్రితం 240 అడుగుల లోతుతో మరో బోరు వేయించినా చుక్క నీరు పడలేదన్నారు. పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదని వాపోయారు. వరుణుడు కరుణించి శీర్పి, కోనాపురం చెరువులు నిండితేనే పంటలను కాపాడుకోగలమని తెలిపారు.

**రేయింబవళ్లు శ్రమిస్తున్నాం**

చిన్న ఎర్రిస్వామి, రైతు, కోనాపురం మాట్లాడుతూ.. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట కళ్లముందే ఎండి పోతుంటే బాధగా ఉందన్నారు. బాడిగా మిర్చి పంట చేతికి రావడానికి సుమారు పది నెలల సమయం పడుతుందని, అప్పటి వరకు పంటను కాపాడు కోవడం తమకు భారంగా మారిందన్నారు.ఎండలు తీవ్రంగా ఉండటంతో ట్యాంకర్ నీటిని పొలానికి తీసుకొచ్చేలోపే తేమ ఆరిపోతోందని తెలిపారు. నీటి కోసం సుదూరం వెళ్లి రావాల్సి వస్తోందని, రేయింబవళు కష్టపడుతున్నా పంటనుకాపాడు కోవడానికి అదనపు ఖర్చులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.వరుణుడు కరుణించి వర్షాలు కురిసి చెరువులు నిండితేనే తమ పంటలకు నీటి కష్టాలు తీరుతాయని రైతులు ఆశగాఎదురుచూస్తున్నారు.

# జర్నలిస్టుల రైల్వే పాసులు పునరుద్ధరించాలి

**- ఎంపీకి ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల పరిరక్షణ సమితి వినతి**




**డోన్ - సూర్య వాస్తవం** : జర్నలిస్టులకు గతంలో అమలులో ఉన్న రైల్వే పాస్‌లను కరోనా సమయంలో రద్దు చేశారని వాటిని వెంటనే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల పరిరక్షణ సమితి డోన్ శాఖ కోరింది. ఈ మేరకు నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గ ఎంపీకి సమితి ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టుల సంక్షేమంతో పాటు ప్రజా రవాణాకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన హెల్త్ స్కీమ్‌లను జర్నలిస్టులకు వర్తింపజేసేలా కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రీయ విద్యాలయాల్లో జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు జర్నలిస్టులకు స్థలాలు కేటాయించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గృహ నిర్మాణాలను మంజూరు చేసి ప్రభుత్వమే నిర్మించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సహజ మరణం చెందిన సందర్భంలో ప్రమాద బీమా తరహాలో సహజ మరణ బీమా పథకాన్ని అమలు చేసి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. గతంలో నడిచిన కర్నూలు--మచిలీపట్నం, కర్నూలు--కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. ఈ రైళ్లు రద్దు కావడంతో ఉద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, యువత, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

కర్నూలు--కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలును డోన్ రైల్వే స్టేషన్ వరకు పొడిగించాలని కోరారు. అలాగే హుబ్లీ--విజయవాడ, కాచిగూడ--యశ్వంత్‌పూర్ మధ్య గతంలో నడిచిన ప్యాసింజర్ రైళ్లను తిరిగి ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. కరోనా సమయంలో రద్దైన ఈ రైళ్లను పునరుద్ధరిస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. డోన్ నుంచి గుంటూరుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును ప్రస్తుతం నాలుగో ప్లాట్‌ఫామ్ నుంచి నడపడం వల్ల వృద్ధులు, చిన్నారులు, మహిళలు, అనారోగ్యంతో ఉన్న ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైలును 1, 2 లేదా 3వ ప్లాట్‌ఫామ్‌పై నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలతో పాటు ప్రజల రైల్వే సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లి సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలు, రైల్వే అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల పరిరక్షణ సమితి డోన్ శాఖ ప్రతినిధులు కోరారు.

## ఘనంగా డోన్ శాసనసభ్యులు

# కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలు

**అభిమానుల నడుమ అంబరాన్నంటిన సంబరాలు జరుపుకున్న కోట్ల అభిమానులు**




**డోన్ - సూర్య వాస్తవం :** మాజీ కేంద్ర మంత్రి, డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పాత బస్టాండ్ గాంధీ సర్కిల్ వద్ద ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కలిసి 75 కేకులను కట్ చేసి ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తూ డోన్ నియో జక వర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మరెన్నో జన్మదినాలు ఆరోగ్యంగా, ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## ఘనంగా డాక్టర్ బోయ భీమన్న 115వ జయంతి



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని ఫుట్బాల్ మైదానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో ప్రెసిడెంట్ అబూ బాకర్,కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు ఆధ్వర్యంలో బోయి భీమన్న 115 వ జయంతి కార్యక్రమం ఘనం గా నిర్వహించారు.కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు,సెక్రెటరీ రామ్ మో హన్ బోయి భీమన్న చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు మాట్లాడుతూ బోయి భీమన్న తూ ర్పు గోదావరి జిల్లా మామిడి కుదురు గ్రామంలో ఓ హరిజన కుటుం బంలో పుట్టారు.వీరు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డ్, పద్మభూషణ్‌తో పాటు ఎన్నో గౌరవ, సన్మానాలు అం దుకున్న కవి బోయి భీమన్న ఆధుని క తెలుగు సాహిత్యంలో తనకంటూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న కళా ప్రపూర్ణుడు పద్యం,గద్యం,గే యం,నాటకం, నాటిక, వచన కవిత లాంటి విభిన్న సాహితీ ప్రక్రియల్లో 70కి పైగా రచనలను వెలువరించి న బోయి భీమన్న వీరిని ఈరోజు జయంతి సందర్భంగా స్మరించుకుందామని కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబాకర్,కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు,సెక్రెటరీ రామ్ మోహన్,షైక్షావలి,నారాయణ రెడ్డి, శామ్యూల్, లక్ష్మి నారాయణ రెడ్డి, హస్సన్ అహమ్మద్, నారాయణ శెట్టి,న రసింహులు, డేనియల్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల



**పామిడి - సూర్య వాస్తవం :** గుంతకల్లు నియోజకవర్గం పరిధిలోని పామిడి మండలంలో స్థానిక ఎన్నికలకు తుది పోలింగ్ కేంద్రాల జాబితాను శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రభాకర్ విడుదల చేయడమైంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పామిడి మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వాటిలో పామిడి పట్టణ పరిధిలో 6 స్థానాలు, గ్రామీణ ప్రాంత పరిధిలో 8 స్థానాలు ఉన్నాయని,ఎన్నికల నిర్వహణ కోసం పామిడి పట్టణంలోని ఎస్సీ హాస్టల్ లో ఒక ఎంపీటీసీ స్థానానికి 3పోలింగ్ కేంద్రాలు, అలాగే పామిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 5ఎంపీటీసీ స్థానాలకు 17 పోలింగ్ కేంద్రాలను, అలాగే గ్రామీణ ప్రాంతంలోని ఎనిమిది ఎంపీటీసీ స్థానాలకు 26 పోలింగ్ కేంద్రాలను, మండల వ్యాప్తంగా మొత్తం 46 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు అశ్వత్తనాయుడు, రంగనాయకులు, ఏఓ హరనాథ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయం మరియు గ్రామీణ సచివాలయాలలో పంచాయతీ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల వివరాల జాబితాలో ప్రచురించచడమైనదని ఆయన పేర్కొన్నారు.

## శ్రీ కృషి వినాయక లడ్డు, వెండి వేలం పాట రూ.87,000



**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో గల శ్రీకృషి వినాయక కమ్యూనిటీ గణపతిని అత్యంత వైభవంగా భారీ ఊరేగింపుతో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఊరేగింపు ప్రారంభ దశలో గణపతికి 5రోజులపాటు నైవేద్యముగా ఉంచిన లడ్డును వేలంపాట పెట్టగా 60 వేల రూపాయలకు నీలకంఠరెడ్డి కుమారుడు పాండురంగారెడ్డి కైవసం చేసుకున్నారు. అలాగే స్వామివారికి మొక్కుబడిగా వచ్చిన రెండు తులాల వెండి గొలుసును కే.మంజుల భర్త కె.శ్రీనివాసచారి 21 వేలకు కైవసం చేసుకున్నారు. అలాగే స్వామివారు ధరించిన కండువ్వను 6,000 రూపాయలకు కొండూరు సుధాకర్ కుమారుడు కె.దిలీప్ కైవసం చేసుకున్నారు. అనంతరం పాల్గొన్న భక్తాదులకు తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తదనంతరం స్వామివారిని మేళతాళాలతో, డ్రమ్స్, డీజే వాయిద్యాలతో యువకులు నృత్య ప్రదర్శనలు, కేరింతల మధ్య అత్యంత వైభవంగా భారీ ఊరేగింపుతో శ్రీ కృషి వినాయక కమ్యూనిటీ వారు నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తాలు పాల్గొని తన్మయం చెందారు.

# స్వచ్ఛ అనంతపురం దిశగా...

# ఎలక్ట్రికల్ ఆటోల సేవలు...!

- 24 ఈ-ఆటోలు ప్రారంభం.. అన్ని డివిజన్లకు విస్తరణకు చర్యలు
- పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం: ఎంపీ అంబికా లక్ష్మినారాయణ




**అనంతపురం కార్పొరేషన్ - సూర్య వాస్తవం :** అనంతపురం నగరాన్ని మరింత పరిశుభ్రంగా, స్వచ్ఛంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చెత్త సేకరణ ఈ-ఆటోలను అందు బాటులోకి తీసుకొచ్చారు. అనంతపురం కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి ఎంపీ అంబికా లక్ష్మినారాయణ ఈ-వాహనాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో 24 ఈ-ఆటోలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. త్వరలో అన్ని డివిజన్లలో ఈ సేవలను విస్తరిం చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతిరోజూ నగర పరిశుభ్రత కోసం కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను అభినందించారు.పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించే చర్యలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. 60 సంవత్సరాలు పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందిన పారిశుద్ధ్య కార్మికుల స్థానాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు.ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా ఈ-వాహనాలకు అందించాలని ఎంపీ కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించడం ద్వారా చెత్త నిర్వహణకు సహకరించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయాలను వినియోగించాలని వ్యాపారులు, ప్రజలకు పిలుపునిచ్చారు.ప్రజలు, అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు సమన్వయంతో పనిచేసి స్వచ్ఛ అనంతపురం నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, వివిధ సంస్థల కార్పొరేషన్స్ డైరెక్టర్లు, చైర్మన్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యం...

- ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలి.!
- జిల్లా అదనపు వైద్యాధికారి డా. జయలక్ష్మి



**గుంతకల్ - సూర్య వాస్తవం :** గుంతకల్ పట్టణంలో కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన లసీడీసీ (లేప్రోజీ కేసు డిటెక్షన్ కాంపెయిన్ ) ఇంటింటి సర్వేను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి డా. జయలక్ష్మి ఏఎన్ఎం లు ఆశా కార్యకర్తలను ఆదేశించారు కుష్టువ్యాధి లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలోని సమావేశ భవనంలో శనివారం కుష్టువ్యాధి ఇంటింటి సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు నిర్వహించిన ఇంటింటి సర్వే పురోగతిని అధికారులు పరిశీలించారు. సర్వేలో ఎదురవుతున్న సమస్యలు, క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఎదురవుతున్న ఇబ్బందులు, అనుసరించాల్సిన సర్వే విధానం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. డా. జయలక్ష్మి మాట్లాడుతూ. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పరిశీ లించే సమయంలో కుష్టువ్యాధి అనుమానిత లక్షణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చర్మంపై స్పర్శజ్ఞానం తగ్గిన మచ్చలు, ఇతర అనుమానాస్పద లక్షణాలు కనిపించినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత వైద్య సిబ్బంది దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనుమానిత కేసులను గుర్తించిన వెంటనే తదుపరి వైద్య పరీక్షలు, చికిత్స కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ప్రతి ఇంటిని సందర్శించి సర్వే వివరాలను సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్దేశించిన విధానాన్ని పాటించాలని, ప్రజలకు కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తూ అపోహలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుష్టువ్యాధి పట్ల ప్రజల్లో భయాందోళనలు, అపోహలు ఉండాల్సిన అవసరం లేదని, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకుంటే నియంత్రించవచ్చని వైద్యాధికారులు తెలిపారు. ఇంటింటి సర్వే ద్వారా అనుమానిత కేసులను ముందుగానే గుర్తించడం, వారికి అవసరమైన వైద్య సేవలు అందించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. సర్వే ప్రక్రియను నిర్దేశించిన కాలపరిమితిలో పూర్తి చేయడంతో పాటు క్షేత్ర స్థాయిలో సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. సర్వే సమయంలో ప్రజల నుంచి సహకారం పొందేందుకు వారికి కార్యక్రమం ఉద్దేశం, ప్రాధాన్యతను వివరించాలని తెలిపారు. సమావేశంలో సర్వే పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించి సిబ్బందికి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలను అందించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో డా.గంగాధర్, డా. హారిత, డా. సంజీదా, డా. రాఘవేంద్ర, పీఎంఓ నాగన్న, డీపీ ఎం ఓ రామదాస్, జిల్లా కోఆర్డినేటర్ జి.వి. రమణ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం



**పామిడి - సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని శ్రీవాసవి కళ్యాణ మండపం (అమ్మవారి శాల) శనివారం పామిడి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రఖ్యాతి చెందిన బెంగుళూరు శంకరకంటి ఆసుపత్రి నేతృత్వంలో గొప్ప ఉచిత కంటిమెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, లైన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు పట్రా శ్రీనివాసులు, పత్రికా ప్రకటనలో తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి యొక్క కంటి వైద్య నిపుణులు కంటి చూపు మందగించిన వారిని పరీక్షించి అవసరమైతే అన్ని రకాల కంటి ఆపరేష న్లకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని, శంకర కంటి ఆసుపత్రి వారు ప్రత్యేక బస్సుల్లో బెంగళూరుకు తీసుకెళ్లి ఆపరేషన్లు అనంతరం తిరిగి గమ్యస్థానమైన పామిడికి చేరుస్తారని వారు తెలియజేశారు. కంటి వైద్య శిబిరంలో పాల్గొనే వారు రెండు ఆధార్ కార్డు జిరాక్సులు, రెండు పాస్ ఫోటోలు తీసుకొని రావాలని తెలియజేశారు. ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని పామిడి మండల ప్రజలే గాక చుట్టూ ప్రక్కల మండలాల కంటి జబ్బులు గల ప్రజలు పాల్గొని పరీక్షించుకోవచ్చని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు విజ్ఞప్తి చేశారు.



## అంగన్వాడీ సెంటర్లలో పౌష్టికాహార మహోత్సవం

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని 1,2,అంగన్వాడి సెంటర్లలో శనివారం ఉదయం సి.డి. పి.ఓ.ఎల్లమ్మ ఆదేశాల మేరకు,సూ పర్ వైజర్ దస్తగిరమ్మ సూచనలు మేరకు అంగన్వాడీ టీచర్లు నాగ మ్మ,జ్యోతి ఆధ్వర్యంలో 9వ పౌష్టి కాహార మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ మె మాట్లాడుతూ గర్భవతులు,బా లింతలు, చిన్నారులకు అవసరమైన సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల సమగ్ర అభివృద్ధికి తోడ్పఫుతుందని సూచించారు. అలాగే ఆకు ఆకుకూరలు,కూర గాయలు ప్రొటీన్ లతో కూడిన ఆహార పదార్థాలును ప్రదర్శించి గర్భవతులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు నాగమ్మ,జ్యోతి,ఏ ఎన్ యం రాజేశ్వరి, మహిళా పోలీస్ రాణీ, ఆయాలు వరాలమ్మ, అక్కమ్మ, ఆశా వర్కర్లు కళావతి, సరోజ, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

## నేడు తగ్గు దేవాలయంలో హిందువులందరూ తప్పక పాల్గొనాలి



**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలో ప్రసిద్ధి చెందిన పురాతన శ్రీఅనంతగజగరుడ లక్ష్మీనారాయణస్వామి (తగ్గు దేవాలయం) లో హిందూ కుటుంబ సభ్యులందరూ ఆదివారం ఉదయం 6:30 గంటలకు పాల్గొనవలసిందిగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మండలశాఖ నాయకులు జోజోడే కుమార్ పత్రిక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమం రాష్ట్రీయ స్వయంసేవక్ సాంగ్ శాఖ ద్వారా నిర్వహించబడునని, ప్రతి ఒక్క హిందూ బంధువు తప్పక పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

## పరిశ్రమలను సందర్శించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు




**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలోని టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యనభ్య సిస్తున్న విద్యార్థులకు వారి వృత్తి విద్య(వొకేషనల్)లో భాగంగా పరిశ్రమ సందర్శనకై గజరాంపల్లి సమీపంలోని శ్రీరంగం పాల పరిశ్రమకు తీసుకెళ్లడం జరిగింది. ఆపరిశ్రమ మేనేజర్ అయినటు గిరిధర్ పాలు ప్రాధాన్యత, ప్యాకింగ్ గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా తెలియజేశారు. అలాగే పాలతో తయారయ్యే వివిధ పదార్థాల విశిష్టతను గూర్చి తెలియజేయడం జరిగింది. పరిశ్రమలో తీసుకోవలసిన జాగ్రత్తలను కూడా తెలియజేశారు. ఈ సందర్భంగా టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులైన కె.రామ్ కుమార్ మాట్లాడుతూ వృత్తి విద్య వలన విద్యార్థులకు వారి భవిష్యత్తుకు కావలసినటువంటి నైపుణ్యాలను ఒకేషనల్ విద్య ద్వారా జీవిత భవిష్యత్తుపై ఒక భరోసా కలుగుతుందని,సులభతరంగా ఆలోచన జరుగుతుంది. ఇందులో భాగంగా పరిశ్రమ సందర్శనకై వారు వెళ్ళినటువంటి శ్రీరంగం పాల పరిశ్రమ వారికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాంకుమార్, ఉపాధ్యాయ బృందం పరిశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.యస్‌లో ప్రత్యేక ఆధార్ కేంద్రాల ఏర్పాటు



| క్ర సం. | తేదీ | సమయము | ఆధార్ క్యాంపు నిర్వహించు ప్రదేశము | ఆధార్ ఆపరేటర్ల వివరములు |
|---|---|---|---|---|
| 1 | 21-09-2026<br>22-09-2026<br>23-09-2026<br>24-09-2026<br>25-09-2026<br>26-09-2026<br>27-09-2026<br>28-09-2026<br>30-09-2026 | 10:30 గం//ల నుండి 5:00 గం//ల వరకు | St Mary EM School<br>St Mary EM School<br>St Mary EM School<br>St Mary EM School<br>St Mary EM School<br>St Mary EM School<br>St Mary EM School<br>St Mary EM School<br>St Mary EM School | B Mushtaq Ahmed, వార్డ్ ఎడ్యుకేషన్ & డిజిటల్ ప్రాసెసింగ్ సెక్రెటరీ |

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారి అదేశాల మేరకు గుత్తి టౌన్‌లో కెప్టెన్ కె.కుమార స్వామి మెమోరియల్ హైస్కూల్, గుత్తి ఆర్.యస్‌లో సేయింట్ మేరీ హైస్కూల్ యందు 0 నుండి 6 సంవత్సరాల పిల్లలకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని మున్సిపల్ కమీషనర్ యన్.సురేంద్ర ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సం దర్భంగా వారు ఆధార్ నమోదు, అప్డేషన్ టీము సచివాలయ సిబ్బంది వారి ద్వారా ఈనెల 21నుం డి 28 వరకు, 30వ తేదీ వరకు ఉదయం10.30 నుండి సాయంత్రం 5గంటల వరకు సదరు సేవలనుపై రెండు కేంద్రాలలో ఆధార్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.

## జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

### - విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని ఆదేశం

**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఐఏఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో చదువు కుంటున్న విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి అవసరాలను తెలు సుకున్నారు. గ్రంథాలయంలో ఎలాంటి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి, ఇంకా ఏయే పుస్తకాలు అవసరం, విద్యార్థులకు కల్పిస్తున్న ఇతర వసతులు ఎలా ఉన్నాయి తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడే అన్ని రకాల పుస్తకాలు, ప్రామాణిక స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా అవసరమైన వసతులను కల్పించాలని అధికారులకు సూచించారు.



# రూ.250 కోట్లతో నూతన తాగునీటి పైప్‌లైన్‌కు భూమి పూజ

### - ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు




**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో జిందాల్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 250 కోట్ల మంచి నీటి, ఇంటింటి మంచినీటి కొళాయి భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం, అనంతపురం జిల్లా పార్లమెంట్ ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖబో ర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ హాజరైనారు.ముందుగా ఎమ్మెల్యేకి కూటమి నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంత రం అక్కడ ఏర్పాటు చేసిన 250 కో ట్ల రూపాయలతో మంచి నీటి పైపు లైను మరియు ఇంటింటికి మంచి నీ టి కొళాయికు భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రోజు మన నియోజకవర్గ చరిత్ర లోనే ఒక సువర్ణాక్షరాల తో లిఖించ దగ్గ రోజు అని, నియోజ కవర్గంలో తాగు నీటి ఎద్దడి లేకుండా చేయడం,ప్రతి ఇంటికీ పరిశుభ్రమైన సురక్షిత నీరు అందించడమే లక్ష్యంగా ఈ రోజు రూ.250 కోట్ల భారీ బడ్జెట్ తో మం చి నీటి పైప్‌లైన్ మరియు ఇంటింటికీ కొళాయి పనులకు భూమి పూజ చేసు కుంటున్నాం మైళ్ల కొద్దీ నడిచి నీళ్లు తెచ్చుకునే ఆడబిడ్డల కష్టాల కు ఈ ప్రాజెక్టుతో శాశ్వత పరిష్కా రం లభిస్తుంది.శుద్ధమైన తాగునీరు అందడం వల్ల నీటి ద్వారా వచ్చేవ్యా ధులు తగ్గి ప్రజల ఆరోగ్యం మెరుగు పడుతుంది.భవిష్యత్తు అవసరాలు రాబోయే 20-30 సంవత్సరాల జ నాభా అవసరాలను దృష్టిలో ఉం చుకుని ఈ పైప్‌లైన్ వ్యవస్థను డిజై న్ చేయడం జరిగింది.ఇచ్చిన



మాట ప్రకారం మన ప్రాంతంలో నీటి సమ స్య లేకుండా చేసేందుకు ప్రభుత్వం ఈ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయడానికి కట్టుబడి ఉంది.ఈ పనులు త్వరలోనే పూర్తయి,ప్రతి ఇం ట్లో మంచినీటి కొళాయి ద్వారా నీరు వచ్చేలా అధికారులు రాత్రింబవళ్లు శ్రమిస్తారు తెలిపారు అలాగే జరగ బోయే స్థానిక సంస్థ ఎలక్షన్లలో కూ టమి ప్రభుత్వం తరఫున ఎవరు పోటీ చేసిన గెలిపించుకొని తీరాలని తె లియజేశారు.ఇంకా రాబోయే రోజు లలో మన గుంతకల్లు నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడిపిస్తానని ఈ సభాముఖంగా అందరికీ తెలియ జేస్తున్నాను.ఈ కార్యక్రమంలో జిందల్ సంస్థ వారు అలాగే ప్రభుత్వ అధికారులు, పెద్ద ఎత్తున మహిళలు, గుత్తి పట్టణం, మండలం కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



# నగరంలో పారిశుద్ధ్యానికి మరింత ప్రాధాన్యం

- ఎమ్మెల్యే దగ్గుపాటి
- ప్రజలు సహకరిస్తేనే స్వచ్ఛ అనంతపురం సాధ్యం
- తడి, పొడి చెత్తను వేర్వేరుగా శుద్ధి చేసేలా చర్యలు
- ఎలక్ట్రిక్ వాహనాలతో కాలుష్య రహిత చెత్త సేకరణ
- స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకం: ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ




**అనంతపురం కార్పొరేషన్ - సూర్య వాస్తవం :** నగరంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఇళ్ల నుంచి కూడా చెత్త సేకరిం చేలా ఎలక్ట్రిక్ ఈ-ఆటోలను అందు బాటులోకి తీసుకొచ్చామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురం నగరపాలక సంస్థకు ప్రభుత్వం కేటాయించిన ఈ-వాహనాలను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఆయన ప్రారం భించారు. నగరపాలక సంస్థకు మొత్తం 62 ఈ-వాహనాలు మంజూరు కాగా, తొలి విడతగా 15 వాహనాలు వచ్చాయని అధికారులు తెలిపారు. చిన్న చిన్న సందుల్లోకి సైతం ఈ వాహనాలు వెళ్లి చెత్తను సేకరించే అవకాశం ఉందని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజలు ఈ-వాహనాలకు చెత్తను అందజేసి పారిశుద్ధ్య కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. గతంలో నగరంలోని డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తలో ఇప్పటికే రెండు లక్షల టన్నులను తొలగించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మిగిలిన చెత్తను కూడా త్వరలో తొలగిస్తామని చెప్పారు. డంపింగ్ యార్డు ప్రాంతంలో రూ.15 కోట్లతో వ్యర్థాల నిర్వహణ



ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా శుద్ధి చేసి ఎరువులు, సిమెంట్ పరిశ్రమలకు ఉపయోగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే ప్రాంతంలో పార్కును కూడా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. ఈ-వాహనాల ద్వారా నగరంలోని మారుమూల ప్రాంతాలకు సైతం చెత్త సేకరణ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జస్వంత్ కుమార్, ఎంహెచ్ఓ రాజా రవీంద్ర చౌదరి, మున్సిపల్ అధికారులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఐఎంఎం బాషా ఇంటికి ఎమ్మెల్యే దగ్గుపాటి

- టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, శ్రీధర్ చౌదరితో ఐఎంఎం భాష సుదీర్ఘ చర్చలు
- భాష వ్యక్తిగత కేసులు సమస్యలు, పరిష్కరిస్తామని ముఖ్య నేతలు హామీ
- సంతోషం వ్యక్తం చేసిన ఐఎంఎం భాష



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అర్బన్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు ఐఎంఎం బాషా ఇంటికి పార్టీ ముఖ్య నాయకులు వెళ్లి ఆయనతో సమావేశమయ్యారు. గత కొంతకాలంగా వివిధ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాషాతో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మైనార్టీ నాయకులు శనివారం మాట్లాడారు. ఈ సందర్భంగా బాషా తన సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నానని, ప్రస్తుతం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తెలిపారు. తనపై ఉన్న మూడు వ్యక్తిగత కేసులతో తనకు సంబంధం లేదని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పందిస్తూ.. చట్టపరంగా సాధ్యమైన అన్ని పరిష్కార మార్గాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఆర్థికపరమైన సమస్యల్లోనూ సాధ్యమైన మేరకు సహకారం అందిస్తామని తెలిపారు.ముస్లిం మైనార్టీలకు ఇళ్ల పట్టాలు అందిస్తామని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూడా నాయకులు ప్రస్తావించారు. ఈ అంశంపై ఇప్పటికే పరిశీలన జరుగుతోందని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు



వెలువడిన వెంటనే మైనార్టీలకు ఇళ్ల పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు స్పష్టం చేశారు. సుదీర్ఘంగా జరిగిన సమావేశం అనంతరం బాషా సంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీపై, నాయకులపై తనకు ఎలాంటి చెడు అభిప్రాయం లేదని, తాను పార్టీకి విధేయుడిగానే కొనసాగుతానని తెలిపారు. ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు స్వయంగా తన ఇంటికి వచ్చి తన సమస్యలను అడిగి తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు.ఈ సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలార్ భాష, మాజీ గ్రంథాలయ చైర్మన్ జిరాయితీ గౌస్ మోద్దిన్, మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్ మహమ్మద్, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అక్రమ వినియోగంపై విజిలెన్స్ నిఘా

- ఆకస్మిక తనిఖీలు.. 20 కేసుల గుర్తింపు
- నాయుడుపేటలో డొమెస్టిక్ మీటర్లతో వాణిజ్య విద్యుత్ వినియోగం గుర్తింపు
- పలు దుకాణాల్లో నిబంధనల ఉల్లంఘనలు.. పెనాల్టీలతో పాటు కమర్షియల్ మీటర్లకు మార్పునకు చర్యలు



**నాయుడుపేట– సూర్య వాస్తవం :**విద్యుత్ వినియోగంలో నిబంధనల ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేసి, విద్యుత్‌ను క్రమబద్ధంగా వినియోగించేలా చర్యలు చేపట్టే దిశగా విజిలెన్స్ అధికారులు నాయుడుపేట పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని పలు దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తనిఖీలు చేపట్టి విద్యుత్ మీటర్లు, కనెక్షన్లు, వినియోగిస్తున్న లోడ్, కనెక్షన్ కేటగిరీ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో గృహ అవసరాల కోసం మంజూరైన డొమెస్టిక్ విద్యుత్ మీటర్లను కొన్ని వాణిజ్య దుకాణాల్లో కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తిరుపతి విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో డీఈ రంగయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి. ప్రభాకర్, డీఈ పూర్ణచంద్రరావు, ఏఈ కృష్ణయ్య, ఏఈ రాజా, సిబ్బంది మల్లికార్జున్, కిశోర్, రాజు తదితరులు పాల్గొని పట్టణంలోని పలు వ్యాపార సంస్థల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ మీటర్లు, కనెక్షన్లను పరిశీలిస్తూ నిబంధనల ప్రకారం విద్యుత్ వినియోగం జరుగుతోందా లేదా అనే అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

**డొమెస్టిక్ మీటర్లతో కమర్షియల్ వినియోగం**

తనిఖీల సందర్భంగా గృహ అవసరాల కోసం మంజూరైన డొమెస్టిక్ విద్యుత్ కనెక్షన్లను వాణిజ్య దుకాణాలు, వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తున్న ఘటనలను అధికారులు గుర్తించారు. విద్యుత్ కనెక్షన్ ఏ ప్రయోజనం కోసం మంజూరైందో అదే ప్రయోజనానికి మాత్రమే వినియోగించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. డొమెస్టిక్ కనెక్షన్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఇప్పటివరకు 20 కేసులను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించిన వినియోగదారులపై సంబంధిత నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, వర్తించే పెనాల్టీలు విధించనున్నట్లు తెలిపారు. అలాగే డొమెస్టిక్ కేటగిరీలో ఉన్న విద్యుత్ కనెక్షన్లను నిబంధనల మేరకు లికమర్షియల్ కనెక్షన్లుగా మార్చేలా చర్యలులి చేపట్టనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

**కొనసాగుతున్న ఆకస్మిక తనిఖీలు**

విద్యుత్ అక్రమ వినియోగాన్ని అరికట్టడం, విద్యుత్ వినియోగంలో పారదర్శకతను పెంపొందించడం, వినియోగదారులు తమకు మంజూరైన కేటగిరీ ప్రకారమే విద్యుత్‌ను వినియోగించేలా చూడడం లక్ష్యంగా విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలను కొనసాగిస్తున్నారు. నాయుడుపేట పట్టణంలో మరిన్ని ప్రాంతాల్లోనూ తనిఖీలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. విద్యుత్ మీటర్లు, కనెక్షన్ల విషయంలో నిబంధనలు పాటించాలని, గృహ అవసరాలకు సంబంధించిన డొమెస్టిక్ కనెక్షన్లను వాణిజ్య కార్యకలాపాలకు వినియోగించరాదని అధికారులు సూచించారు. వ్యాపార సంస్థలు తమ విద్యుత్ వినియోగానికి అనుగుణంగా సరైన కేటగిరీలో కనెక్షన్ పొందాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించిన సందర్భాల్లో సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**అక్రమ విద్యుత్ వినియోగానికి అడ్డుకట్ట వేసే దిశగా**

నాయుడుపేట పట్టణంలో విజిలెన్స్ అధికారులు చేపడుతున్న ఆకస్మిక తనిఖీలు విద్యుత్ వినియోగ నిబంధనల అమలుపై పర్యవేక్షణను మరింత బలోపేతం చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో విద్యుత్ కనెక్షన్లను పరిశీలిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వినియోగాన్ని గుర్తించడం, సంబంధిత వినియోగదారులను సరైన కేటగిరీలోకి తీసుకురావడం, విద్యుత్ ఆదాయానికి నష్టం కలగకుండా చూడడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. తనిఖీలు ఇంకా కొనసాగుతున్నందున మరిన్ని కేసులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# ఏడు రోజులుగా తాగునీటి కటకట.. రోడ్డెక్కిన మునిరత్నం నగర్ వాసులు

- పైప్‌లైన్ పగిలినా పట్టించుకోని అధికారులు.. సమస్య పరిష్కారానికి డిమాండ్
- మున్సిపల్ అధికారుల చుట్టూ తిరిగినా స్పందన లేదని కాలనీవాసుల ఆవేదన.. ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన





**నాయుడుపేట– సూర్య వాస్తవం:** నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని మునిరత్నం నగర్ కాలనీలో ఏడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. హైవే విస్తరణ, మరమ్మతు పనుల్లో భాగంగా చేపట్టిన తవ్వకాల సమయంలో కాలనీకి తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ దెబ్బతినడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు కాలనీవాసులు తెలిపారు. పైప్‌లైన్ దెబ్బతిని వారం రోజులు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**చుక్కనీటి కోసం అవస్థలు**

తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో కాలనీలోని కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రోజువారీ అవసరాలకు అవసరమైన నీటి కోసం ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరుతున్నప్పటికీ ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**అధికారుల స్పందనపై అసంతృప్తి**

తాగునీటి సమస్యపై మున్సిపల్ అధికారులను సంప్రదించినప్పటికీ సరైన స్పందన లభించలేదని కాలనీవాసులు ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా, ఇది హైవే పనులకు సంబంధించిన సమస్యగా పేర్కొంటూ తాను ఏమీ చేయలేనని చెప్పినట్లు వారు తెలిపారు. అనంతరం ఫోన్ అందుబాటులో లేకుండా పోయిందని కాలనీవాసులు ఆరోపించారు.

అదేవిధంగా సంబంధిత పంచాయతీ కార్యదర్శిని సంప్రదించినా సమస్య పరిష్కారానికి తగిన స్పందన రాలేదని వారు తెలిపారు. ప్రజలకు కనీస తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన విషయంలో అధికారులు ఒకరిపై ఒకరు బాధ్యతను నెట్టివేస్తున్నారని కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ప్రధాన రహదారిపై బైఠాయింపు**

ఏడు రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతోపాటు అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో విసిగిపోయిన మునిరత్నం నగర్ కాలనీవాసులు శనివారం మల్లాం--నాయుడుపేట ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద సంఖ్యలో ప్రజలు రోడ్డుపైకి రావడంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడి వాహనాలు నిలిచిపోయాయి.

**ఆందోళనకారులతో సీఐ చర్చలు**

సమాచారం అందుకున్న నాయుడుపేట సీఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న కాలనీవాసులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, ఆందోళన విరమించాలని కోరారు. అనంతరం రహదారిపై నిలిచిపోయిన వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

**తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరించాలి**

ప్రజలకు తాగునీరు అందించడం స్థానిక సంస్థల ప్రాథమిక బాధ్యతల్లో ఒకటని కాలనీవాసులు పేర్కొన్నారు.

పైప్‌లైన్ దెబ్బతిన్న విషయం తెలిసినప్పటికీ ఏడు రోజులుగా మరమ్మతులు చేపట్టకపోవడం వల్లే సమస్య తీవ్రరూపం దాల్చిందని వారు అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టి దెబ్బతిన్న పైప్‌లైన్‌కు తక్షణమే మరమ్మతులు చేయించాలని, కాలనీకి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని మునిరత్నం నగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న "మంత్రి సత్య కుమార్"



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** మంగళగిరిలో అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా, పాముకాటు నివారణ, సకాలంలో వైద్యం, శాస్త్రీయ ప్రథమ చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించే గోడపత్రికను రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ విడుదల చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జనవరి నుంచి ఆగస్టు వరకు రాష్ట్రంలో 4,111 పాముకాటు కేసులు నమోదవగా, ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో 2,807 విరుగుడు మందులు అందుబాటులో ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేందుకు 108 అంబులెన్సుల్లోనూ విరుగుడు మందు అందుబాటులో ఉంచారు. సెప్టెంబర్ 19 నుంచి 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే అవగాహన కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాలు, రైతులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, గిరిజనులు, అటవీ ప్రాంత ప్రజలకు పాముకాటు నివారణ,సకాలంలో వైద్యం పొందడంపై విస్తృతంగా అవగాహన కల్పించ నున్నారు. అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ తెలిపారు.

# పరిశుభ్రత ఆరోగ్యానికి శ్రీరామరక్ష... ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ





**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:**గ్రామీణ ప్రాంతాలు పట్టణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యానికి శ్రీరామరక్షగా ఉంటుంది. అని సూళ్లూరుపేట నియోజ కవర్గం ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు.ఆమె సూళ్లూరుపేటలో నిర్వహించిన స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... .సూళ్లూరుపేట ను ప్లాస్టిక్ రహిత నియోజకవర్గం గా తీర్చిదిద్దేతఅందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన"స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం సూళ్లూరుపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో విస్తృత పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ?మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఎమ్మెల్యే చీపురు పట్టి బస్టాండ్ ప్రాంగణాన్ని ఊడ్చి శుభ్రం చేసి స్వచ్ఛతా స్ఫూర్తిని చాటారు.అనంతరం బస్టాండ్‌లోని దుకాణాల వద్దకు వెళ్లి వ్యాపారులకు,ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మాత్రమే సీజనల్ వ్యాధులు,ఇతర ఆరోగ్య సమస్యలను అరికట్టగలమని ఆమె స్పష్టం చేశారు.పరిశుభ్రతే ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని సూచించారు.అనంతరం నియోజకవర్గ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న ఉత్తమ పారిశుధ్య కార్మికులను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సత్కరించారు.పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని కోరుతూ అందరితో కలిసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ..

- "సీడీపీవో జ్యోతి కిరణ్ "



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:**సూళ్లూరుపేట ప్రాజెక్ట్ స్త్రీ- శిశు సంక్షేమ శాఖలో కాళీ ఏర్పడిన అంగన్వాడి కార్యకర్త(1) సహాయకులు(10) పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 21 నుండి అక్టోబర్1వ తేదీలోపు వారి దరఖాస్తులను సూళ్లూరుపేట కార్యాలయంలో సమర్పి ంచాలని ఒక ప్రకటనలో సిడిపిఓ జ్యోతి కిరణ్ తెలిపారు. తడ మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామ అంగన్వాడీ కార్యకర్తగా దరఖాస్తు చేయాలనుకున్నవారు 21-35లోపు వయస్సు తోపాటు 10వ తరగతి విద్యార్హత కలిగి,బి సి -ఏ గ్రూపు కులస్తులై ఉండాలని సూచించారు. అదేవిధంగా సహాయకులుగా సూళ్లూరుపేట మండలంలో 1) జంగాలగుంట,ఎస్సీ గ్రూప్ -3,2) జంగాలపల్లి,బి సి -ఏ 3) మన్నార పోలూరు గిరిజన కాలనీ,ఎస్టీ 4) శబరి కాలనీ,ఎస్టీ 5) కసారెడ్డిపాలెం, ఓసి,తడ మండలంలోని 1) చిన్న మాంబట్టు,బి సి -ఏ,2) గ్రద్ద గుంట గిరిజన కాలనీ,ఎస్టి దొరవారిసత్రం మండలంలోని మానేరు అంగన్వాడి హెల్పర్ పోస్ట్ బిసి బి,,కొత్తపల్లి-ఎస్సీ,సింగనాలతూరు-ఓసి కేటగిరీల అభ్యర్థులు వివాహితులై స్థానికులై ఉన్న వారే దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. పదవ తరగతి అర్హత అభ్యర్థులు లేనట్లయితే 8వ తరగతి చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు.ఇంటర్వ్యూకు హాజరయ్యేటప్పుడు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలియపరిచారు.సకాలంలో ఆయా గ్రామాల అభ్యర్థులు నిర్ణీత గడువులోపు దరఖాస్తులను కార్యాలయంలో సమర్పించే రసీదులు పొందాలని వెల్లడించారు.

# సూళ్లూరుపేట నియోజకవర్గ స్థాయి సమావేశం

- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు,ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ మంత్రి డాక్టర్ కాకాని గోవర్ధన్ రెడ్డి సూచనలతో, సూళ్లూరు పేట నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో సూళ్లూరు పేట నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించబడుతుంది. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు.ఈ సమావేశం సెప్టెంబర్ 21, 2026 సోమవారం మధ్యాహ్నం 3:00 గంటలకు నాయుడుపేట పట్టణంలోని ఇండియన్ బ్యాంక్ ఎదురుగా,ఐసీఐసీఐ బ్యాంక్ సమీపంలో ఉన్న మీటింగ్ హాల్ నందు జరుగుతుంది.ఈ సమావేశానికి సూళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించిన రాష్ట్ర,జిల్లా,మండల స్థాయి పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు,ముఖ్య నాయకులు,కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తప్పక హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే తెలిపారు.పార్టీ బలోపేతం,ప్రజా సమస్యలపై పోరాటం,రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు,పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించడం జరుగుతుంది.కావున పార్టీ నాయకులు,కార్యకర్తలు అందరూ సమయానికి హాజరై తమ సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.అదేవిధంగా ఈ సమావేశానికి ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను కూడా సాదరంగా ఆహ్వానిస్తున్నాము. అని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు.

## డీఆర్ఓ చేతుల మీదుగా

# ఆళ్లగడ్డ రాముకు అవార్డు...!

**- 8 ఏళ్లుగా ఉచిత మట్టి వినాయకుల పంపిణీకి గుర్తింపు : ఆళ్లగడ్డ రాము**






**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** అనంతపురం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, గత ఎనిమిదేళ్లుగా నిర్విరామంగా ఉచిత మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శ్రీవారి సేవకుల సేవలను హ్యూమన్ రైట్స్ సంస్థ గుర్తించింది. ఈ సందర్భంగా 25 మంది శ్రీవారి సేవకులకు సర్టిఫికెట్లు, అవార్డులను అందజేశారు. శనివారం ఉదయం కలెక్టరేట్ ప్రాంగణంలోని డీఆర్ఓ ఛాంబర్‌లో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) చేతుల మీదుగా శ్రీవారి సేవకులు సర్టిఫికెట్లు, అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ.. శ్రీవారి సేవకులు చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని మంచి కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు.శ్రీవారి సేవకుల తరఫున ఆళ్లగడ్డ రాము మాట్లాడుతూ.. తమ సేవలను గుర్తించి అవార్డులు, సర్టిఫికెట్లు అందించిన హ్యూమన్ రైట్స్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. డీఆర్ఓ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీవారి సేవకులు రాంప్రసాద్, రామ్మూర్తి, ప్రసాద్, అనిల్, శివ, ప్రకాష్, సురేష్, సాయి, శ్రీనివాస్, సంతోష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు

**- ఇటాచి సీజ్**




**గార్లదిన్నె- సూర్య వాస్తవం :** అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములు, చెరువులు మరియు వాగుల నుండి మట్టిని తరలించడాన్ని అక్రమ మట్టి తవ్వకాలు యదేచ్ఛగా జరుగుతున్నాయి..... అసలు వివరల్లోకి వెళితే.....గార్లదిన్నె మండలం పరిధిలోని కల్లూరు సమీపంలో గల కొండను హిటాచ్ ద్వారా త్రవ్వి ట్రిప్పర్లతో తరలిస్తుండగా గనులు భూగర్భ శాస్త్రశాఖ జిల్లా ఉన్నతాధికారి (ఎఫ్ఎసి) ఆదినారాయణ కేసు నమోదు చేసుకొని ఇటాచ్ ను సీజ్ చేసినట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గలువలో మరియు భూగర్భ శాస్త్ర విభాగం (అభివృద్ధి నియంత్రణ) చట్టం 1957 లోని సెక్షన్ 21,ఆంధ్రప్రదేశ్ ఖనిజ రాయితీ నియమావళి 1966 లోని నియమం 26.3 జీవో ఎం.ఎస్ నెంబర్ 388 రవాణా రహదారులు మరియు భవనాల (టిఆర్–111) శాఖ ఈనెల 16 తేదీన ఖలేజా రవాణా వాహనాలను తలకి చేస్తుండగా రాయల్టీ, ట్రాన్సిట్ ఫారాలు (ఫాస్) లేకుండా కళ్యాణం తీసుకెళుతున్న వాహనాలను గుర్తించడం జరిగిందని అందువల్ల ఇటాచ్ ను గుర్తించి అదుపులోనికి తీసుకోని కేసు నమోదు చేసి సురక్షితమైన రాప్తాడు పోలీస్ స్టేషన్లో అప్పగించి సీజ్ చేయడం జరిగిందన్నారు. కేసు పరిష్కారం అయ్యేవరకు వాహనం అక్కడే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మట్టిని గర్విస్తున్న నాలుగు ట్రిప్పర్లు అయినట్లని, వాటి పైన చర్యలు ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# అంబేద్కర్ ఉత్సవాల్లో లడ్డూకు రూ.30 వేలు

**- వేలంలో దక్కించుకున్న టీడిపి నాయకుడు, మాజీ సర్పంచ్ భూపతి**



**బెళుగుప్ప – సూర్య వాస్తవం:** మండలంలోని శీర్పి గ్రామ పంచాయతీ ఎస్సీ కాలనీలో అంబేద్కర్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన విగ్రహ ఉత్సవాల్లో లడ్డూ వేలం ఉత్సాహంగా సాగింది. వేలంలో మాజీ సర్పంచ్ భూపతి రూ.30,000లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా యువసేన సభ్యులు, గ్రామస్థులు పాల్గొని ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

# కుమ్మరపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం**

రామాపురం మండలం కుమ్మరపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, మౌలిక వసతులు, డిజిటల్ విద్యా సదుపాయాల వినియోగాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. గణితం, ఆంగ్లం సబ్జెక్టుల్లో విద్యార్థుల అవగాహనను పరీక్షించారు. గణిత సమస్యలను విద్యార్థులకు అందించి వాటిని ఏ విధంగా పరిష్కరిస్తున్నారో పరిశీలించారు. అదేవిధంగా ఆంగ్లంలో ఇచ్చిన వాక్యాలను వివిధ కాలాల్లోకి మార్చే విధానంపై విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డును పరిశీలించిన కలెక్టర్, దాని ద్వారా విద్యార్థులకు బోధన జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. డిజిటల్ బోర్డు నిర్వహణ, వినియోగంపై ఉపాధ్యాయులకు ఉన్న అవగాహనను కూడా పరిశీ లించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యాబోధనలో సమర్థవంతంగా వినియోగించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. ఉపాధ్యా యులు విద్యార్థిని విద్యార్థుల పై మరింత దృష్టి సారించి వెనుకబడిన సబ్జెక్టుల్లో మెరుగుపడే విధంగా కృషి చేయాలని, ఈ విషయమై ఉపాధ్యాయులు అల సత్వం వహిస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ పనులు, వాటి ప్రస్తుత పరిస్థితిపై వివరాలను సేకరించి సమగ్ర నివేదికను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగు దలకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించా లని, పదో తరగతి విద్యార్థులకు నిరంతరం అభ్యాసం కల్పిస్తూ పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం స్వర్ణాంధ్ర- స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్య క్ర మంలో ఎంపీడీవో జాషువా, తాసిల్దారు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ...!

**- గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులతో కలెక్టర్ ముఖాముఖి అంగన్వాడీ ప్రీ-స్కూల్ కార్యకలాపాలను పరిశీలించిన కలెక్టర్**



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం:** అనంతపురం నగరంలోని పాతూరు బరమప్ప వీధి అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులతో కలెక్టర్ మాట్లాడి పోషణ మాసం ముఖ్య ఉద్దేశాలను వివరించారు. ఆకుకూరలు, కూరగాయలు, ధాన్యాలు, పప్పు దినుసులు తదితర పోషకాహార పదార్థాలను పరిశీలించి, సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

పౌష్టికాహారం ద్వారా చిన్నారులకు ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించడంతో పాటు తల్లి, బిడ్డల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రీ-స్కూల్ కార్యకలాపాలను పరిశీలించి సిబ్బందిని అభినందించారు. అంగన్వాడీ చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు, ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పోషణ మాస కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు "ప్రతి ముద్దలో పోషణ -- వైవిధ్యం" అనే నినాదంతో జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.కార్యక్రమంలో పీడీ సజిదా బేగం, సీడీపీఓ లలిత, సూపర్‌వైజర్లు హేమ, విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త జయభారతి తదితరులు పాల్గొన్నారు.

# అభయ విఘ్నేశ్వర స్వామి సేవలో టీడీపీ నాయకులు

**- ముడుమాల పోలిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వెయ్యి మందికి అల్పాహారం**



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి గుడి వద్ద వెలసిన శ్రీ అభయ విఘ్నేశ్వర స్వామి మండపం వద్ద తెలుగుదేశం పార్టీ సీనియర్ మండల నాయకులు ముడుమాల పోలిరెడ్డి, ఆయన ధర్మపత్ని లక్ష్మీదేవి ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహార వితరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మంది భక్తులకు పూరీలతో అల్పాహారం అందజేశారు.అంతకుముందు టీడీపీ సీనియర్ మండల నాయకులు ముడుమాల పోలిరెడ్డి, ఎస్.ఆర్. శ్రీనివాసరెడ్డి, పెంచల్ రెడ్డి తదితరులు శ్రీ అభయ విఘ్నేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో నాయకులకు ఘన స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి సోదరులు శ్రీ దత్తాత్రేయ స్వామి చేతులు మీదుగా వారిని ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అల్పాహారం అందించిన ముడుమాల పోలిరెడ్డి దంపతులను కమిటీసభ్యులుఅభినందించారు



# వికసిత్ భారత్ లక్ష్య సాధనపై ఢిల్లీలో కీలక సదస్సు...!

**- ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతిపై ఢిల్లీలో మంత్రి పయ్యావుల ప్రసంగం**

**అనంతపురం – సూర్య వాస్తవం :** వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అవసరమైన ఆర్థిక వ్యూహాలు, పెట్టుబడుల సమీకరణ, రాష్ట్రాల ఆర్థికాభివృద్ధి వంటి కీలక అంశాలపై ఢిల్లీలో నిర్వహిస్తున్న సదస్సులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతి, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలమైన వాతా వరణం, ఆర్థిక వృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై మంత్రి పయ్యావుల కేశవ్ ప్రసంగించారు.పెట్టుబడులను ఆకర్షించ డం, ఉపాధి అవకాశాలను పెంపొందించడం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఈ సందర్భంగా వివరించారు.

# కాంగ్రెస్ పార్టీతోనే మైనార్టీల అభివృద్ధి

## - కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగపు జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్

**కడప - సూర్య వాస్తవం :** భారతదేశంలో , రాష్ట్రం లో ముస్లిం మైనార్టీల రక్షణ కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగపు జిల్లా అధ్యక్షుడు మయాన రామతుల్లా ఖాన్ స్పష్టం చేశారు. కడపలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా మైనార్టీ విభాగం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో, రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.యస్. షర్మిల రెడ్డి నాయకత్వంలో, మైనార్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ దాదాగాంధీ నాయకత్వంలో, కడప జిల్లాలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి ఆధ్వర్యంలో మైనార్టీలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందన్నారు. ముస్లిం మైనార్టీలకు రాష్ట్ర, కేంద్రం లోని కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. జిల్లా మైనార్టీ విభాగం ప్రధానంగా మైనార్టీ సమస్యలపై పోరాటం చేస్తోం దన్నారు. త్వరలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ విభాగపు కమిటీ నియమిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఉన్నత పదవులు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ పదవులు



మాత్రమే కాకుండా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలలో ముస్లింలు, దళితులకు అత్యంత గౌరవమైన పదవులు ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ అతి చరిత్ర సృష్టించినట్లు తెలిపారు.

ప్రస్తుతం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ సారథి సీఎం చంద్రబాబు నాయుడు ముస్లిం మైనార్టీలకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. ఇప్పటికీ మతవిద్వేష పరిపాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. త్వరలో కేంద్రంలోని ఎన్ డి ఏ అభిముఖ భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ రౌఫ్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేతలు రహమతుల్లా ఖాన్, జిలాన్, నాసిర్, రఫీ ఖాన్, ఎండి ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### రిజిస్ట్రేషన్ సేవల్లో పారదర్శకత పాటిస్తూ..

# ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలు అందించాలి

## - రాయచోటి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం :**రాయచోటిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజల సంఖ్య, ఆ రోజు పూర్తయిన రిజిస్ట్రేషన్లు, స్లాట్ బుకింగ్ వివరాలను సబ్‌రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయం వద్ద వేచి ఉన్న ప్రజలను జిల్లా కలెక్టర్ స్వయంగా కలిసి, వారి స్లాట్ సమయాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, కార్యాలయంలో అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు అందుతున్న తీరుపై వారి అభిప్రాయాలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలోని వివిధ రికార్డులను పరిశీలించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాటిస్తున్న విధానాలను తనిఖీ చేశారు. ఇప్పటివరకు పూర్తయిన రిజిస్ట్రేషన్ల వివరాలను పరిశీలించడంతో పాటు, రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న కొంతమంది



వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడి కార్యాలయంలో సేవలు ఎలా అందుతున్నాయి, సిబ్బంది స్పందన ఏ విధంగా ఉంది, ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయనే అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, సకాలంలో అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కార్యాలయ నిర్వహణ, రికార్డుల భద్రత, ప్రజలకు అందించే సేవల విషయంలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో సబ్‌రిజిస్ట్రార్, రిజిస్ట్రేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొన్నెపల్లె హరిజనవాడకు రోడ్డు ఎప్పుడు?

- నాలుగేళ్లుగా వినతులు.. పరిశీలనలు, సర్వేలు జరిగినా ఫలితం లేదు
- కెఎంసి అధికారుల తీరుపై మాదిగల జేఏసీ ఆగ్రహం

**కడప- సూర్య వాస్తవం:** చింతకొమ్మదిన్నె మండలం మామ్మిళ్లపల్లె పంచాయతీ పరిధిలోని కొన్నెపల్లె హరిజనవాడకు రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ గత నాలుగు సంవత్సరాలుగా అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదని మాదిగల జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కడప నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న మాదిగల జేఏసీ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి పచ్చారం బాలసుబ్బయ్య ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసుబ్బయ్య మాట్లాడుతూ కొన్నెపల్లె హరిజనవాడకు రోడ్డు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌తో పాటు కడప మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు స్పందన కార్యక్రమంలో వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. కలెక్టర్‌కు సమర్పించిన అర్జీలు మున్సిపల్ కమిషనర్‌కు పంపిన సందర్భంలో అప్పటి కమిషనర్ ప్రవీణ్ చందు ఎస్సీ కాలనీకి త్వరగా రోడ్డు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అయితే నాలుగేళ్లుగా అధికారులు ఎస్టిమేషన్ సిద్ధం చేశామని, రోడ్డు మంజూరు అవుతుందని చెబుతున్న



ప్పటికీ ఆచరణలో మాత్రం రోడ్డు నిర్మాణం జరగలేదని అన్నారు. అధికారులు పలుమార్లు ప్రాంతాన్ని పరిశీలించి అప్రూవల్ చేస్తామని చెప్పి వెళ్లడం తప్ప ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తరువాత వచ్చిన కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి హయాంలో డీఈ, ఏఈ అధికారులు సచివాలయ సర్వేయర్ ద్వారా సర్వే చేయించారని, అనంతరం మండల సర్వేయర్ ద్వారా కూడా సర్వే చేయించి నివేదిక సమర్పించామని తెలిపారు. కాలనీ ప్రజలే స్వంత డబ్బులతో జేసీబీ సహాయంతో దారిని శుభ్రం చేసుకున్నారని చెప్పారు. ఇటీవల మరోసారి కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, అధికారులు ఎస్టిమేషన్ చేస్తామని చెప్పి, దారి వెంబడి ఇళ్లు ఉన్నందున రోడ్డు వేయడం సాధ్యంకాదనే కారణంతో ఎండార్స్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. పాత రహదారి ఉన్న ప్రాంతంలో చుట్టుపక్కల వ్యవసాయ భూముల యజమానులు కూడా తమకు ఉన్న దారి మేరకు రోడ్డు వేసుకోవడానికి సహకరిస్తామని చెబు తున్నప్పటికీ అధికారులు వివిధ కారణాలు చూపుతున్నారని ఆరోపించారు.

కొన్నెపల్లె హరిజనవాడలోని ప్రాంతం కార్పొరేషన్ పరిధిలో 243వ బూత్ సెంటర్‌గా ఉందని, ఎన్నికల సమయంలో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్డు సమస్యపై కేఎంసీ డీఈ, ఏఈ అధికారుల తీరుపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి**

కొన్నెపల్లె హరిజనవాడకు రోడ్డు మంజూరు చేసి నిర్మాణం చేపట్టేలా కడప జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని మాదిగల జేఏసీ నాయకులు కోరారు. గత నాలుగేళ్లుగా తాము సమర్పించిన వినతిపత్రాలు, అర్జీలను పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.



# కులమతాలకు అతీతంగా బాల వినాయక ఉత్సవాలు

## - శాంతకుమారి వీధిలో ఘనంగా అన్నదాన కార్యక్రమం



ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 19 సూర్య వాస్తవం: ప్రొద్దుటూరు పట్టణంలోని 26వ వార్డు శాంతకుమారి వీధిలో శ్రీ శ్రీ శ్రీ బాల వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న



వినాయక ఉత్సవాల్లో భాగంగా శనివారం ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు గురు ప్రసాద్, హర్షవర్ధన్, సురేశ్ ప్రత్యేక ఆహ్వానం మేరకు టీడీపీ మైనారిటీ నాయకులు నూరి కార్యక్రమానికి హాజరై భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు నూరిని ఘనంగా సన్మానించారు. అనంతరం నూరి మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ బాల వినాయక 32వ వార్షికోత్సవాన్ని కులమతాలకు అతీతంగా వార్డులోని ప్రజలందరూ కలిసి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. వినాయక ఉత్సవాలు ప్రజల మధ్య సోదరభావం, ఐక్యతను మరింత పెంపొందించేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, వార్డులోని ప్రజలందరినీ భాగస్వాములను చేయడం అభినందనీయమన్నారు. భగవంతుని ఆశీస్సులతో వార్డులోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. శ్రీబాల వినాయక స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి వచ్చిన భక్తులు, స్థానిక ప్రజలకు నిర్వాహకులు సాదరంగా భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా వార్డులో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులు, యువత, మహిళలు, పెద్దలు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ నాయకులు నూరితో పాటు ఆయన మిత్రులు ఇస్మాయిల్, నాగరాజు, కుళ్లాయప్ప, షకీల్, చౌసెన్, గౌస్ మోదీన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉత్సవ కమిటీ సభ్యులను స్థానికులు అభినందించారు.

## ఘనంగా లక్ష్మీ గణపతి, లక్ష్మీ కుబేర హోమాలు



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి గుడి వద్ద వెలిసిన శ్రీ అభయ విఘ్నేశ్వర స్వామి మండపంలో గత ఐదు రోజులుగా విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినట్లు గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆరవ రోజు శనివారం అభయ విఘ్నేశ్వర స్వామి మండపం ఆస్థాన పండితులు వీరభద్ర స్వామి ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి హోమం, లక్ష్మీ కుబేర హోమం, రుద్ర హోమం, మృత్యుంజయ హోమాలను శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దంపతులు హోమంలో పాల్గొని స్వహస్తాలతో హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాల్లో పాల్గొన్న భక్తులు ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. అలాగే వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దంపతులు మాట్లాడుతూ ఇలాంటి పవిత్ర కార్యక్రమంలో స్వయంగా హోమం నిర్వహించుకునే అవకాశం కల్పించిన గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం నిరంతరం కార్యక్రమాలను నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ సేవలను పలువురు అభినందించారు.

## లైంగిక వేధింపుల ఆరోపణలపై విచారణ చేపట్టాలి

**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం దిగువ హరిజనవాడ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కులశేఖర్ రెడ్డిపై మహిళ లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన నేపథ్యంలో అధికారులు తక్షణమే విచారణ




చేపట్టాలని పీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోడటివ టికంటి నాగరాజు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న ఘటన జరిగినట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ 18 రోజులు గడిచినా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోపణలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. డీఈఓ సుబ్రహ్మణ్యం వ్యవహారశైలిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి విచారణ చేపట్టాలని నాగరాజు డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు పీఎస్ఎఫ్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో పీఎస్ఎఫ్ నాయకులు వెంకటేష్, సుబ్రహ్మణ్యం, ఖాదర్ బాషా పాల్గొన్నారు.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140